క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ సూరాయపాలెం ఫీడర్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టాఫీస్ రోడ్డు ఏరియా, వసుంధర ఆర్టిస్ట్స్ అపార్ట్‌మెంట్ ఏరియా, వాటర్ ఫిల్టర్ బెడ్ ఏరియా, పెదర్ల హోమ్స్ అపార్ట్‌మెంట్ ఏరియా, సాయి శంకర అపార్ట్‌మెంట్ ఏరియాలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

తిరువూరులో హోటల్ దగ్ధం



తిరువూరు: స్థానిక ఫ్యాక్టరీ సెంటర్ సమీపంలోని హోటల్ బుధవారం తెల్లవారు జామున దగ్ధమైంది. 40 ఏళ్లుగా కేరళకు చెందిన చంద్రన్ కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న ఈ హోటల్లో ఒక్కసారిగా మంటలు ఎగసి సామగ్రి పూర్తిగా కాలిపోయింది. హోటల్‌పైనే ఆధారపడి జీవిస్తున్న తమకు తీరని నష్టం జరిగిందని, జీవనోపాధి కోల్పోయామని నిర్వాహకులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. వైఎస్సార్ సీపీ వార్డు కౌన్సిలర్లు మూడు దుర్గా, మోదుగు ప్రసాద్, పరసా సత్యనారాయణ, ఇనపనూరి చిన్నారి తదితరులు చంద్రన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిత్యావసరాలు అందజేత



ఇబ్రహీంపట్నం: ప్రేమ్ నికేతన్ దివ్యాంగుల సంస్థకు గుడ్ సమరిటన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. ప్రవాస భారతీయులు కన్నా ప్రవీణ్, సౌమ్య దంపతుల ఆర్థిక సహాయంతో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టేలు కోటేశ్వరరావు వీటిని అందించారు. ఆయన మాట్లాడుతూ వృత్తిరీత్యా విదేశాలకు వెళ్లిన ప్రవీణ్ దంపతులు దివ్యాంగులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. వారి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ కార్యదర్శి వేల్పుల రాజేష్, సభ్యులు చిట్టేలు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎంపీపీ మెర్సీవనజాక్షి



విస్సన్నపేట: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై చర్చించారు. ఎంపీడీఓ జి. విజయకుమారి, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

చాట్రాయి: మండలంలో ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో మొదటిసారిగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, 160 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు.

రేపు లక్ష మల్లెలతో అర్చన

తిరువూరు: వైశాఖ మాసం సందర్భంగా తిరువూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని సంతోషి మాత దేవాలయంలో ఈ నెల 24న లక్ష మల్లెలతో అర్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆశిస్తూ సాయంత్రం 6 గంటలకు ఆలయంలో జరిగే లక్ష మల్లెల అర్చనలో భక్తులు పాల్గొనాలని కోరారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

నందిగామ: జాతీయ సేవా పథకంలో భాగంగా బాపట్లలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు పల్లగిరి గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని విద్యార్థులు తెలిపారు.

వైభవంగా నృసింహస్వామి జయంత్యుత్సవం



విశేష అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



చందన అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నృసింహ స్వామి జయంత్యుత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఉభయ దాతలుగా ఆగిరిపల్లికి చెందిన శ్రీనివాసరావు దంపతులు, అవుటుపల్లికి చెందిన నరసింహారావు దంపతులు వ్యవహరించారు. స్వామివార్లకు శాంతి కల్యాణం, పంచామృత స్నపన, విశేష అలంకరణ, లక్ష్మీ నృసింహ మూలమంత్రం హోమం, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగాలను ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు, జి.అనంత కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి సురేష్ పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చందన అలంకరణలో స్వామివారు

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో విరాజిల్లుతున్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహస్వామి, చెంచులక్ష్మి, రాజ్యలక్ష్మిదేవికి శంకు, చక్ర, సహస్ర ధార ద్వారా పంచామృతాలు, నవ ఫల రసాలతో అభిషేకం జరిపారు. లక్ష్మీనరసింహస్వామికి ఉసిరినూనె రాసి చందనంతో అలంకరించి విశేష పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

తిరువూరు పదో వార్డులో కార్డన్ సెర్చ్



తిరువూరులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరువూరు: తిరువూరు పట్టణంలోని 10వ వార్డులో బుధవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఏసీపీ విజయకుమార్ ఆధ్వర్యంలో సుందరయ్య కాలనీలో నివాస గృహాలను తనిఖీలు చేసి స్థానికేతరులు, అనుమానాస్పద వ్యక్తుల కోసం గాలించారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులను ప్రశ్నించారు. సరైన రికార్డులు లేని 12 ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

తిరువూరు మెయిన్‌రోడ్డులో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. బోస్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలు, ఇతర సామగ్రిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలతో విజ్ఞానం పెంపు



తిరువూరు గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తిరువూరు: వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులు, చిన్నారుల్లో విజ్ఞానం పెంపొందుతోందని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. బుధవారం విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చామని చెప్పారు. దేశభక్తి గీతాలాపన, బొమ్మల తయారీ, చిత్రలేఖనం తదితర అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చదరంగం, క్యారమ్స్‌లో మెలకువలను తెలిపారు. చిన్నతనం నుంచే ఆటల్లో ఆసక్తి పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

● కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైందని గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు శిబిరం జరుగుతుందని చెప్పారు. డ్రాయింగ్‌తో పాటు వివిధ రకాల క్రీడా పోటీలలో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు గ్రంథాలయంలో సంప్రదించాలని కోరారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



చిట్టేలలో పిల్లలకు అడ్మిషన్లు ఇచ్చిన ఉపాధ్యాయులు

తిరువూరు: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బుధవారం ప్రచారం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా చిట్టేల, గానుగపాడు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిఈడు పిల్లలను గుర్తించి అడ్మిషన్లు ఇచ్చారు. ఐదేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ కార్యక్రమాలు ఉంటాయని, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతోందని, మధ్యాహ్న భోజనం, అమ్మ ఒడి పథకం కింద తల్లుల ఖాతాలో నగదు జమ, ఉచిత యూనిఫాం, విద్యా కానుక కిట్లను ప్రభుత్వం సరఫరా చేస్తోందని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంప్రదీప్, మచ్చా శ్రీనివాస్, వినయ్ కుమార్, యాకూబ్, పీవీఎన్ ప్రసాద్, కొండలరావు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి వేటూరి

విజయవాడకల్చరల్: వేటూరి పాట తెలుగు సాహిత్యపు పూదోట అని కామ్రేడ్ జీఆర్కే, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. కామ్రేడ్ జీఆర్కే, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, సాంస్కృతిక సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సాహితీవేత్త, పరిశోధకుడు, సినీ పాటల రచయిత వేటూరి సుందరరామ్మూర్తి విగ్రహం వద్ద ఆయన 14వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. విగ్రహానికి నివాళి అర్పించిన అనంతరం గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి వేటూరి అని అన్నారు. వేటూరి సాహిత్య పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ.. వేటూరి ఓ సీత కథతో సినీ రంగ ప్రవేశం చేశారని, 15 వేలకు పైగా పాటలను రచించారని తెలిపారు. వేటూరి చాలా రకాలైన పాటలు రాశారని, సంప్రదాయ కవిత్వం నుంచి జానపద గీతాల వరకు ఆయన ముద్ర కనిపిస్తుందన్నారు. రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే పాటకు 1994లో జాతీయ పురస్కారం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో జానపద గాయకుడు దామోదర గణపతిరావు, చింతకాయల చిట్టిబాబు, చలపతిరావు, శ్యాం ప్రసాద్, ఆదిరాల జయప్రభు, ప్రిన్స్‌తో పాటు వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తాటిముంజలతో ఉపశమనం



నూజివీడు: వేసవిలో తాటిముంజలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఎండల తీవ్రత నుంచి ఉపశమనానికి మానవాళికి ప్రకృతి ప్రసాదించిన వరం తాటిముంజలు. వేసవి సీజన్‌లో మాత్రమే దొరికే వీటిని విక్రయిస్తూ ఎంతోమంది జీవనోపాధిని పొందుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే దొరికే తాటిముంజలు ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సైతం రోడ్ల వెంట లభిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు తాటికాయలను కోసుకొచ్చి రోడ్ల వెంట, పట్టణాల్లో పెట్టి వాటి నుంచి ముంజలను తీసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం డజను ముంజలను రూ.50లకు విక్రయిస్తున్నారు. అనేక మంది ఈ సీజన్‌లో దీనినే వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వేసవి తీవ్రత కారణంగా మన శరీరం నుంచి పోయే అనేక పోషకాలను కొబ్బరి బొండాలతో పాటు తాటిముంజలు తిరిగి అందిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకూ ప్రతి గ్యాస్ వినియోగదారుడికి ఉచితంగా ఈకేవైసీ, సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ చేయిస్తున్నామని... సింగ్‌నగర్ హెచ్‌పీ గ్యాస్ పరిధిలోని వినియోగదారులంతా తప్పనిసరిగా ఈకేవైసీని విధిగా చేయించుకోవాలని హెచ్‌పీ గ్యాస్ సింగ్‌నగర్ డిస్ట్రిబ్యూటర్, మేనేజింగ్ పార్టనర్ శ్రీభవ్య కోరారు. సింగ్‌నగర్ నూజివీడు రోడ్డులోని కంపెనీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈకేవైసీ నమోదు చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో గ్యాస్ ఏజెన్సీ నుంచి తమ సిబ్బంది వచ్చి ప్రతి గ్యాస్ వినియోగదారుడి ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్‌కు వినియోగించే పైపును పరిశీలించడం, వినియోగదారులకు ఉచితంగా ఈకేవైసీ చేస్తారని చెప్పారు. జూన్ 30వ తేదీ లోగా వీటిని చేయించుకోవాలని, లేనిపక్షంలో ఆ తరువాత నుంచి గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు.

తమ పరిధిలోని హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి వెంటనే ఈకేవైసీ, సేఫ్టీ ఇన్‌స్పెక్షన్‌లను చేయించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు ఫోన్ 0866–2401234, 94923 39494, 99665 22844 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

లోతు దుక్కులతో తెగుళ్లు దూరం

ముసునూరు: పంట పొలాల్లో లోతు దుక్కులు దున్నడం వలన తెగుళ్లు దూరమై అధిక దిగుబడులు లభిస్తాయని మండల వ్యవసాయ శాఖాధికారి సందిపాము మధుమోహన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో లోతు దుక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పొలాన్ని లోతుగా దున్నడం వలన భూమి నుంచి పంటలను ఆశించే తెగుళ్లను నివారించ వచ్చని చెప్పారు. లోతు దుక్కుల వలన లార్వా, కోశస్థ దశలో ఉన్న పురుగులు బయటికి రావడం, వాటిని పక్షులు తినివేయడంతో తెగుళ్ల బెడద తప్పుతుందన్నారు. భూమిలో ఉండే సూక్ష్మ జీవులకు తగినంత గాలి లభించి సేంద్రియ పదార్థాల తయారీకి ఉపకరిస్తాయని, పొలంలో మట్టి గడ్డలు తొలగిపోయి, మెత్తని మట్టి ఏర్పడి పంట త్వరగా పెరిగేందుకు దోహద పడుతుందని చెప్పారు. దీంతోపాటు సకాలంలో కలుపు నివారణ చర్యలు తీసుకుంటూ పంటలు పండించడం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు మేలు జరుగుతుందని వివరించారు. తమ శాఖ ద్వారా లభించే సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసుకోవాలని చెప్పారు.

అభివృద్ధిపథంలో మిల్క్ యూనియన్

దాములూరు(ఇబ్రహీంపట్నం): కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు పదవీ బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు నిండి ఆరో ఏడాదిలోకి అడుగు పెడుతున్న సందర్భంగా స్థానిక పాల సేకరణ కేంద్రం వద్ద సంబరాలు జరుపుకున్నారు. వివిధ గ్రామాలకు చెందిన పాల సంఘాల అధ్యక్షులు, సూపర్ వైజర్లు కేక్ కట్ చేసి చైర్మన్ ఆంజనేయులకు అభినందనలు తెలిపారు. ఐదేళ్లుగా యూనియన్ అభివృద్ధి పథకంలో నడుస్తుందన్నారు. పాలసేకరణ ధర పలు దఫాలుగా పెంచి పాడి రైతులను ఆదుకుందని తెలిపారు. వివిధ గ్రామాల పాల సేకరణ సంఘాల అధ్యక్షులు సీహెచ్ చిట్టిబాబు, వి.శ్రీనివాసరావు, కవిత, తిరుపతిరావు, రాణి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ముసునూరు: కిశోర బాలికలకు రుతుక్రమంపై సంపూర్ణ అవగాహన కల్పించాలని నూజివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ నూరాని అన్నారు. గోపవరం సచివాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలు, వారి తల్లులకు రుతుక్రమంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ సమకాలీన పరిస్థితులను తెలుసుకుంటూ సమాజాన్ని అర్థం చేసుకుని, తగిన జాగ్రత్తలతో కిశోర బాలికలు నడుచుకోవాలన్నారు. రుతుక్రమ సమయాల్లో జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, స్వీకరించవలసిన పోషకాహారం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన కల్పించారు. బాలికల పట్ల వారి తల్లులు జాగ్రత్త వహించాలన్నారు. ఏసీడీపీఓ నాగేశ్వరి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ లక్ష్మీప్రసన్న, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు రోడ్డులోని అప్సర థియేటర్ సమీపంలో ఫర్నిచర్ డీలక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించి, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రోజురోజుకు వేసవి తాపం పెరుగుతోందన్నారు. అధిక ఎండలను దృష్టిలో ఉంచుకుని ఈ మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారని చెప్పారు. స్థానికులతో పాటు నగరానికి ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం దోహదపడుతుందన్నారు. నిర్వాహకులను ఎమ్మెల్యే విష్ణు అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు దామోదర్, సాయిబాబా, రాంబాబు, సుధీర్, కృష్ణకిషోర్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు దేవాలయ భూముల కౌలు వేలం

భీమవరం(వత్సవాయి): గ్రామంలోని కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయ భూముల కౌలు వేలం ఈనెల 24వ తేదీన నిర్వహిస్తామని ఈఓ సీహెచ్ హరి దుర్గానాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం పది గంటలకు దేవాలయ ప్రాంగణంలో వేలం జరుగుతుందన్నారు. 9.46 సెంట్ల భూమికి ఒక సంవత్సర కాలానికి వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. హెచ్చుపాటదారుగా నిలిచినవారు వెంటనే కౌలు చెల్లించాలని చెప్పారు. గతంలో ఆలయానికి బకాయిలు ఉన్నవారు పాటలో పాల్గొనేందుకు అనర్హులన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

పెద్దాపురం(వీరులపాడు): వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం గ్రామ శివారులో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు రికార్డులను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. ఆటోవాలాలు పరిమితి మేరకు మాత్రమే ప్రయాణికులను ఎక్కించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్, వాహనాల రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు.

కౌంటింగ్ ప్రక్రియకు సహకరించండి

జేసీ సంపత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్

మైలవరం: జూన్ 4వ తేదీన కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని మైలవరం నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్ అన్నారు. మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో ఏఆర్వోలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, చెదురుమదురు ఘటనలు మినహా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని చెప్పారు. మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో కౌంటింగ్‌కు సంబంధించి అసెంబ్లీకి 12, పార్లమెంట్‌కు 17 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి ఏ విధంగా కౌంటింగ్ సమర్థవంతంగా నిర్వహించాలో దిశానిర్దేశం చేశారు. సమావేశంలో తహసీల్దార్ రాజేశ్వరరావు, మైలవరం నియోజకవర్గ ఏఆర్వోలు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి లేదు

తిరువూరు సీఐ అబ్దుల్ నబీ



మాట్లాడుతున్న సీఐ అబ్దుల్ నబీ, ఎస్‌ఐ శ్రీను

గంపలగూడెం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో బాణసంచా క్రయ, విక్రయాలకు అనుమతి లేదని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ తెలిపారు. బుధవారం ఆయన గంపలగూడెం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ఎస్. శ్రీనుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బాణసంచా విక్రయించినా, కొనుగోలు చేసినా వారితో పాటు, తరలించిన వాహన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు. నూజివీడు నుంచి రూ. 25 వేల విలువ గల బాణసంచా కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా మండలంలోని ఊటుకూరులో అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. సంబంధిత డ్రైవర్‌ను అరెస్టు చేసి, ఆటో సీజ్ చేశామన్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎలాంటి విజయోత్సవాలు, ప్రదర్శనలు నిర్వహించేందుకు వీలు లేదన్నారు. నిబంధనలు అతిక్రమించి ప్రదర్శనలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోలు,ట్రాక్టర్లకు స్పీకర్లు ఏర్పాటు చేసి పాటలు ప్రచారం చేస్తే అట్టి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా 144 సెక్షన్ అమలులో ఉందని, నలుగురికి మించి ప్రజలు గూమికూడ రాదని చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశానుసారం గతంలో ఏదైనా కేసులో ఉన్న వారిని ముందుగానే బైండోవర్ చేస్తామని చెప్పారు. రాజకీయ ప్రలోభాలకు లోబడి వివాదాలకు వెళ్లి తమ జీవితాలను పాడు చేసుకోవద్దని ప్రజలకు ఆయన హితవు పలికారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

ముసునూరు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖాధికారి సందిపాము మధుమోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీలుగ 160 క్వింటాళ్లు, జనుము 100 క్వింటాళ్లు, పిల్లిపెసర 70 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. భూసారం తక్కువ గల పొలాల్లో సారాన్ని పెంచేందుకు ఉపకరించే జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను రైతులందరూ 50 శాతం రాయితీపై వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా పొందవచ్చన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో వచ్చి తమ గ్రామంలోని ఆర్బీకేలోనే పచ్చిరొట్ట విత్తనాలు పొందవచ్చన్నారు. పొలంలో పచ్చి రొట్ట విత్తనాలను చల్లి, మొక్కలు పెరిగి, పూత దశకు చేరుకున్న తరువాత భూమిలో కలియ దున్నాలని చెప్పారు. దీంతో భూసారం పెరిగి, రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. ఈ ఏడాది పచ్చిరొట్ట ఎరువుల వాడకం అధికంగా జరిగేలా రైతులకు అవగాహన కల్పించామని ఆయన చెప్పారు.

● నూజివీడు: పచ్చిరొట్ట విత్తనాలు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి బుధవారం తెలిపారు. జీలుగ 150 క్వింటాళ్లు, పిల్లిపెసర 53 క్వింటాళ్లు, జనుము 121 క్వింటాళ్ల చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు. రాయితీ పోను జీలుగ కిలోకు రూ.44, జనుము కిలోకు రూ.44, పిల్లిపెసర కిలోకు రూ.67 చొప్పున చెల్లించాలన్నారు. ఒక ఎకరాకు జీలుగ 10 కిలోలు, జనుము 10 కిలోలు, పిల్లిపెసర 8 కిలోలు చొప్పున సాగు చేసుకోవాలన్నారు.

పాల ఉత్పత్తి పెంపునకు సహకరించాలి



లక్ష్మీపురంలో కేక్ కట్ చేస్తున్న మేనేజర్ సాంబశివమూర్తి

తిరువూరు: వ్యవసాయ అనుబంధంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని తిరువూరు క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి అన్నారు. జిల్లా పాలకవర్గ పదవీకాలం ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో బుధవారం పాల ఉత్పత్తిదారుల సమావేశం నిర్వహించారు. ప్రతికూల వాతావరణంలో కూడా పాల దిగుబడిని పెంచడానికి ప్రోత్సాహకాలను అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు నేతృత్వంలోని జిల్లా యూనియన్ పాలకవర్గం ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: గీతాంజలి మ్యూజికల్, సుశీల్ మీడియా, వేదగంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 14వ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. డాక్టర్ జయంతి చక్రవర్తి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సునీల్, మల్లాది స్వాతి, భారతి, భాగ్యశ్రీ, రూపశ్రీ, తులసి, శివశర్మ, రాజ్ కిషోర్, దామోదర గణపతిరావు తదితరులు వేటూరి సినీ పాటలను మధురంగా ఆలపించారు. సుప్రీం కోర్టు న్యాయవాది వరప్రసాద్ మాట్లాడుతూ.. బహుముఖ ప్రజ్ఞాశాలి వేటూరి సుందరరామ్మూర్తి అని అభివర్ణించారు. ఆయన సినీ గేయరచయిత మాత్రమే కాదని, పలు గ్రంథాలను రచించారన్నారు. ఆయన 8 నంది పురస్కారాలు అందుకున్నారని శ్రీశ్రీ తరువాత తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి వేటూరి అని తెలిపారు. సాహితీ సంస్థల ప్రతినిధులు పి.విజయలక్ష్మి, ప్రసూనా రామన్, వెంకాయమ్మ, బి.వీరభద్రరావు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అతిథులు వేటూరి చిత్ర పటానికి నివాళులర్పించారు.